క్లుప్తంగా

7న పారిజాతగిరి ఆలయం మూసివేత

జంగారెడ్డిగూడెం: గోకుల తిరుమల పారిజాత గిరి శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఈ నెల 7వ తేదీ ఆదివారం చంద్ర గ్రహణ సందర్భంగా ఉదయం 11:30 గంటలకు మహా నివేదన అనంతరం ఆలయం మూసి వేయబడుతుందని ఈవో కలగర శ్రీనివాస్ తెలిపారు. తిరిగి 8వ తేదీ సోమవారం ఉదయం ఆలయ శుద్ధి సంప్రోక్షణ అనంతరం మధ్యాహ్నం 12 గంటల నుంచి తెరుస్తామని కార్యనిర్వహణ అధికారి కలగర శ్రీనివాస్ తెలిపారు.

మద్ది అంజన్నకు ప్రత్యేక పూజలు


పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

జంగారెడ్డిగూడెం: మద్ది ఆంజనేయ స్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు ముగింపు సందర్భంగా ఆంజనేయునికి ప్రత్యేక పూజలు చేసినట్లు ఈవో ఆర్‌వీ చందన తెలిపారు. పవిత్రోత్సవాల్లో చివరి రోజు ఆలయంలో పవిత్ర విసర్జన, మహా పూర్ణాహుతి, దీక్షావిసర్జన, మహదాశీర్వచనం, పండిత సత్కారాలు నిర్వహింపబడునవి. పవిత్రాలంకరణలో స్వామి వారు భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయంలో గత మూడు రోజుల నుంచి నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు గురువారంతో ముగిశాయన్నారు.

వాహనాల తనిఖీ


వాహనాలను తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

బుట్టాయగూడెం: మండల కేంద్రమైన జీలుగుమిల్లి రాష్ట్ర సరిహద్దులో ఏఎంసీ తనిఖీ కేంద్రం వద్ద గురువారం విజిలెన్స్ అధికారులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీ హరీష్ కుమార్ గుప్తా, రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి పి.మహేష్ ఆదేశాల మేరకు జిల్లా విజిలెన్స్, వ్యవసాయశాఖ ఏఎంసీ అధికారులు సంయుక్తంగా ఈ తనిఖీలు నిర్వహించారు. యూరియా అక్రమంగా తరలిస్తున్నారనే అనుమానంతో ఈ తనిఖీలు నిర్వహించినట్లు విజిలెన్స్ డీఎస్పీ సింగులూరి వెంకటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో విజిలెన్స్ ఎస్సై కె.నాగరాజు, జీలుగుమిల్లి మండల ఏఎంసీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీని సందర్శించిన డీపీవో


పంచాయతీలో సర్వేలను పరిశీలిస్తున్న డీపీవో అనురాధ

లింగపాలెం: మండలంలోని బాదరాల పంచాయతీని జిల్లా పంచాయతీ అధికారి కె.అనురాధ సందర్శించారు. పంచాయతీలో సామిత్వ సర్వేలో భాగంగా గ్రౌండ్ ట్రూతింగ్, వెక్టరైజేషన్ పనులు, శానిటేషన్ పనులను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ఎ.సుందరి, బాదరాల, ఆశన్నగూడెం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నూతన కమిటీ ప్రమాణ స్వీకారం


ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కమిటీ సభ్యులు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలో కే9 కాపు సంక్షేమ సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. గుర్వాయిగూడెం మానవత కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి జెట్టి గురునాధరావు మాట్లాడుతూ రాజకీయ జోక్యం లేకుండా, కేవలం సంక్షేమ దిశలో కాపులు ముందుకు సాగాలని సూచించారు. నూతన కమిటీచే గౌరవ అధ్యక్షుడు దాకారపు కృష్ణ ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, పారేపల్లి నరేష్, తొమ్మిదేళ్ళ శ్రీనివాసరావు, గౌతు సత్యేంద్ర బాబు, మాజీ ఏఎంసీ చైర్మన్ పారేపల్లి రామారావు పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్‌పర్సన్ నియామకం

చింతలపూడి: చింతలపూడి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా చీదరాల దుర్గాపార్వతి నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

గంగమ్మ చెంతకు శివపుత్రుడు

- క్షేత్రంలో అట్టహాసంగా గణేష్ నిమజ్జన వేడుకలు
- ఆకట్టుకున్న చిత్ర విచిత్ర వేషధారణలు


ద్వారకాతిరుమల: ఊరేగింపులో ఆకట్టుకున్న శక్తి వేషధారణలు


కొయ్యలగూడెం: గణనాథుని ఊరేగిస్తున్న భక్తులు

ద్వారకాతిరుమల: మండలంలోని పలు గ్రామాల్లో గణేష్ నిమజ్జన వేడుకలు గురువారం వైభవంగా నిర్వహించారు. అందులో భాగంగా ద్వారకాతిరుమలలోని చెరువు వీధిలో గణేష్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలు చూపరులను ఆకట్టుకున్నాయి. చిత్రవిచిత్ర వేషధారణలు, తీన్మార్ డప్పు వాయిద్యాలు, బాణాసంచా కాల్పులు, డీజే సౌండ్లు, యువకుల నృత్యాల నడుమ స్వామివారి ఊరేగింపు క్షేత్ర పురవీధుల్లో వైభవంగా నిర్వహించారు. రాత్రి వినాయక విగ్రహాన్ని పంగిడిగూడెంలోని పోలవరం కుడి కాలువలో గణేష్ నామస్మరణల నడుమ అట్టహాసంగా నిమజ్జనం చేశారు.

రేచర్లలో చవితి ఉత్సవాలు

చింతలపూడి: మండలంలోని రేచర్ల రామాలయం దగ్గర గణపతి నవరాత్రి ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గురువారం సర్పంచ్ కె.శివరామకృష్ణ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నాయకులు వినాయకుని దర్శించుకుని పూజలు నిర్వహించారు. జెడ్పీటీసీ నీరజా సుధాకర్, ఎంపీపీ డాక్టర్ బి.రాంబాబు నాయక్, వైఎస్సార్ సీపీ జిల్లా మున్సిపల్ విభాగం అధ్యక్షుడు బొడ్డు వెంకటేశ్వరరావు, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు శ్రీనివాసరావు, నియోజకవర్గం రైతు విభాగం అధ్యక్షుడు అలవాల ఖాదర్ బాబురెడ్డి, నియోజకవర్గ మహిళ విభాగం అధ్యక్షురాలు కనమత రెడ్డి చండీ ప్రియ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గణేష్ నిమజ్జనాలు

లింగపాలెం: కె.గోకవరం గ్రామంలో శ్రీ అభయాంజనేయ స్వామి గుడి వద్ద ఏర్పాటు చేసిన శ్రీగణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా విఘ్నేశ్వరుని శోభాయాత్ర, నిమజ్జనం కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. అలాగే గ్రామంలో మూడు చోట్ల ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాల శోభాయాత్ర, నిమజ్జన కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు.

అన్నసమారధన

జంగారెడ్డిగూడెం: గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా స్థానిక అశోక్‌నగర్‌లో 9వ రోజు అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా బత్తిన లక్ష్మి మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా అశోక్‌నగర్‌లో మహిళలు గణేష్ నవరాత్రి వేడుకలు నిర్వహిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో బత్తిన చిన్న, పుల్లారావు, కుక్కల ధర్మరాజు, వడిగళ్ల శ్రీనివాస్, గుబ్బల అబ్బాస్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఊరూరా ఊరేగింపులు

కొయ్యలగూడెం: వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా గురువారం గణనాథుల ఊరేగింపులు ఉత్సవాలు హోరెత్తాయి. గ్రహణ ప్రభావంతో నిమజ్జనోత్సవాలు ముందుగానే నిర్వహించుకోవాలి అన్న పండితుల సూచనలతో 9వ రోజు అన్న సమారాధనలు నిర్వహించి గణనాథులను మండల వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామాలలోని వీధుల్లో ఊరేగిస్తూ బాణసంచా కాల్చుతూ సంబరాలు నిర్వహించారు. కొయ్యలగూడెం మెయిన్ సెంటర్ గణనాథుని ఊరేగింపులో విచిత్ర వేషధారణలు నిర్వహించారు.

ఆనందోత్సవాల నడుమ వినాయక నిమజ్జనం

కుక్కునూరు: మండల వ్యాప్తంగా గురువారం వినాయక నిమజ్జనాలు ఘనంగా నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు విశేష పూజలందుకున్న గణనాథులను గురువారం భక్తులు నిమజ్జనానికి తరలించారు. ముందుగా పూజలు నిర్వహించి వినాయక విగ్రహాలను ట్రాక్టర్లలో ఊరేగింపుకు తరలించారు. వినాయక నిమజ్జనం సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. మండపాల వద్ద ఉత్సవ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు.


చింతలపూడి: రేచర్లలో బొజ్జగణపయ్యను దర్శించుకున్న వైఎస్సార్ సీపీ నాయకులు


లింగపాలెం: కె.గోకవరంలో వినాయకుడిని ఊరేగిస్తున్న కమిటీ సభ్యులు


జంగారెడ్డిగూడెం: అన్నసమారధనను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి


కుక్కునూరు: వినాయక విగ్రహాన్ని నిమజ్జనానికి ఊరేగింపుగా తరలిస్తున్న భక్తులు

వైఎస్సార్ సీపీ గ్రామాధ్యక్షుల నియామకం

జంగారెడ్డిగూడెం: మండలంలోని నిమ్మలగూడెం, లక్కవరం, దేవులపల్లి గ్రామాలకు వైఎస్సార్ సీపీ గ్రామాధ్యక్షులను నియమించినట్లు చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు తెలిపారు. నిమ్మలగూడెం అధ్యక్షుడిగా మణికే నాగేశ్వరరావు, లక్కవరం చిర్ల దుర్గారెడ్డి, దేవులపల్లి దోరేపల్లి సత్యనారాయణ (సత్తిరాజు)లను నియమించామన్నారు.

జేసీ ఆకస్మిక తనిఖీలు


అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జేసీ ధాత్రి రెడ్డి

ద్వారకాతిరుమల: మండల కేంద్రమైన ద్వారకాతిరుమలలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని, అలాగే దొరసానిపాడులోని ఎరువుల దుకాణాన్ని జాయింట్ కలెక్టర్ పి.ధాత్రి రెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత ఆమె ద్వారకాతిరుమలలోని అంగన్‌వాడీ కేంద్రం-3ను పరిశీలించి, మధ్యాహ్న భోజనం వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె పిల్లలతో ముచ్చటించారు. తరువాత దొరసానిపాడు పరిధిలోని వేపాలమ్మ ఆలయ సమీపంలో ఉన్న ఓ ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేసిన ఆమె పలు రికార్డులను పరిశీలించారు. రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగు మందులను మాత్రమే విక్రయించాలని వ్యాపారికి సూచించారు.

ఆర్‌ఎంపీ కేంద్రంలో తనిఖీ


ఆర్‌ఎంపీ సెంటర్‌లో తనిఖీ చేస్తున్న వైద్యాధికారి

కొయ్యలగూడెం: కొయ్యలగూడెంలోని ఆర్‌ఎంపీ సెంటర్లను పీహెచ్‌సీ వైద్యాధికారిణి ఎస్‌కే తస్లీమా గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. డీఎంహెచ్‌వో ఆదేశాల మేరకు కొయ్యలగూడెం, శివారు ప్రాంతాల్లో ఆరోపించబడిన ఆర్‌ఎంపీ సెంటర్లను వైద్య ఆరోగ్య సిబ్బందితో కలిసి పరిశీలించారు. కలెక్టర్, డీఎంహెచ్‌వోకు కొయ్యలగూడెం నుంచి కొందరు రోగులు ఆర్‌ఎంపీల వలన వారు చేసిన వైద్యం వలన తాము అనారోగ్యానికి గురయ్యామని ఫిర్యాదు చేయడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తనిఖీలు చేపట్టామన్నారు. నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిస్తామని తెలిపారు.

డీఎల్‌పీఓగా సుబ్బరాయన్


ఏవీ సుబ్బరాయన్

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేస్తున్న ఆకుల వెంకట సుబ్బరాయన్ డీఎల్‌పీఓగా పదోన్నతి పొందారు. ఈ మేరకు ఆయనను జంగారెడ్డిగూడెం డీఎల్‌పీఓగా నియమిస్తూ రాష్ట్ర పంచాయితీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ వీఆర్ కృష్ణతేజ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈయనతో పాటు జిల్లాలోని పలువురు డిప్యూటీ ఎంపీడీవోలు, ఎంపీడీవోలుగా పదోన్నతి పొందారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ కమిటీల నియామకం

కొయ్యలగూడెం: వైఎస్సార్ సీపీ కొయ్యలగూడెం మండల అనుబంధ విభాగాల కమిటీ అధ్యక్షులను అధిష్ఠానం ఆదేశాల మేరకు నియమించినట్లు మండల కన్వీనర్ తుమ్మలపల్లి గంగరాజు గురువారం పేర్కొన్నారు. ప్రకటించిన సభ్యులంతా మండల స్థాయి హోదాలో విధులు నిర్వహిస్తారన్నారు. యూత్ అధ్యక్షుడిగా పొంగుటూరు సర్పంచ్ పసుపులేటి రాంబాబు, మహిళా అధ్యక్షురాలు గొడ్డటి రాణి (దిప్పకాయలపాడు), బీసీసెల్ మారిశెట్టి శ్రీను (కొయ్యలగూడెం), రైతు విభాగం గంటా రమేష్ (గవరవరం), వాణిజ్య విభాగం కంభంపాటి బుజ్జిబాబు(బయ్యనగూడెం), ఎస్టీ సెల్ కురసం మురళి (కిచప్పగూడెం), ఎస్సీ సెల్ దూలపల్లి కాంతారావు (ధర్మారావుపేట), చేనేత విభాగం కాశగాని నాగరాజు (కొయ్యలగూడెం), పంచాయతీరాజ్ మండపాటి రామకృష్ణ (సరిపల్లి), మైనార్టీ సెల్ షేక్ మస్తాన్ వల్లి (రాజవరం), వైసీపీ సేవాదళ్ గద్దం చింటూ(కన్నాపురం), టియుసి చవల నాగేశ్వరరావు(తిమ్మన కుంట), క్రిస్టియన్ మైనారిటీ శ్యామరాజు(కొయ్యలగూడెం), ప్రచార విభాగం ప్రగడ శివాజీ(గవరవరం), సోషల్ మీడియా సొంగ రాకేష్(కన్నాపురం), విద్యార్థి విభాగం కోడెల్లి అఖిల్(కొయ్యలగూడెం), దివ్యాంగ శాఖ టేకుమూడి దుర్గారావు(కొయ్యలగూడెం), వైఎస్సార్‌టీఎఫ్ సంసాని వెంకన్న బాబు(మంగపతి దేవి పేట), అంగన్‌వాడీ విభాగం ఘంటసాల సీనమ్మ(కొయ్యలగూడెం), సాంస్కృతిక విభాగం తగరం ఆశీర్వాదం(చొప్పరామన్నగూడెం), వలంటరీ విభాగం ఆకుల విజయ్ (కొయ్యలగూడెం), ఆర్‌టీఐ విభాగం చిటికెన రామలింగస్వామి (కొయ్యలగూడెం)లను మాజీ ఎమ్మెల్యే, పోలవరం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ తెల్లం బాలరాజు ఆదేశాల మేరకు నియమించినట్లు తెలిపారు. పొంగుటూరు గ్రామంలో పసుపులేటి రాంబాబును పలువురు నాయకులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఉప్పలపాడు గ్రామాధ్యక్షుడిగా సత్యనారాయణ


నూతనంగా ఎన్నుకున్న ఉప్పలపాడు వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ

కామవరపుకోట: ఉప్పలపాడు వైఎస్సార్ సీపీ గ్రామాధ్యక్షుడిగా చవల సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు పార్టీ గ్రామ పరిశీలకులు బొల్లు సత్యనారాయణ తెలిపారు. మండల కన్వీనర్ రాయంకుల సత్యనారాయణ పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రామ కమిటీ ప్రధాన కార్యదర్శులుగా వీరవల్లి జలచంద్రరావు, బొప్పన ఏడుకొండలు, ఆడమిల్లి రాంబాబు, దోరెపల్లి సాయిరామ్, కార్యదర్శులుగా చవల రాము, మద్దాల నాగేశ్వరావు, తోళం దుర్గారావు, ఉద్దండు దుర్గబాబులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కనికెళ్లి రత్నకుమారి, సర్పంచ్ ఉద్దండు ధనలక్ష్మి శ్రీనివాసరావు, కనికెళ్లి ఏసుపాదం, పాల వెంకటరత్నం, చవల కుమార్ స్వామి, మట్టా సతీష్, బొప్పన దుర్గారావు, పాల శివ, చవల నాగబాబు, చవల మంగరాజు, చవల రవి, చవల వెంకటేశ్వరరావు, చవల రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ


హెడ్ కానిస్టేబుల్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే బాలరాజు

బుట్టాయగూడెం: ఇటీవల విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మృతి చెందిన స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్ బుడుపుల సుబ్బారావు కుటుంబ సభ్యులను గురువారం మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అండగా ఉంటామని అన్నారు. తొలిత సుబ్బారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మొడియం రామతులసి, పార్టీ జిల్లా కార్యదర్శి సయ్యద్ బాజీ, పార్టీ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు తాళ్లూరి ప్రసాద్, జిల్లా విభజన విభాగం ఉపాధ్యక్షుడు బగ్గి దినేష్, సర్పంచ్‌లు బన్నే బుచ్చిరాజు, తెల్లం వెంకటలక్ష్మి, మాల్చి వెంకన్నబాబు, నాయకులు తెల్లం దేవరాజు, రవి, తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎన్‌జీవోస్ పోలవరం యూనిట్ ఏకగ్రీవ ఎన్నిక


ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

పోలవరం రూరల్: పోలవరం తాలూకా ఏపీ ఎన్‌జీవోస్ సంఘం ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. గురువారం పోలవరం గ్రామంలో ఏపీఎన్‌జీవోస్ ఎన్నికల అధికారులు పోలవరం తాలూకా ఎన్నికలు నిర్వహించారు. పోలవరం తాలూకా అధ్యక్షుడిగా ఎస్‌ఆర్‌పీవీ మాత్రాజు, సహాయ అధ్యక్షుడిగా కె.శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా జి.బాలకృష్ణ, ఆర్.శివానందం, టి.రాజబాబు, కార్యదర్శిగా సూర్యదేవర సునీల్ కుమార్, జాయింట్ సెక్రటరీలుగా ఆచంట శ్రీహరితేజ, అశ్విని, కోశాధికారిగా కొండ వీరవెంకట నాగరాజు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి పందిరి శ్రీనివాస్, సహాయ అధికారి కె.స్వామి, పరిశీలకులు పి.శ్రీనివాస్‌లు తెలిపారు. అలాగే పోలవరం తాలుకా మహిళా విభాగం సభ్యులను కూడా ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీ ఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షులు చోడగిరి శ్రీనివాసరావు, కార్యదర్శి నెరుసు రామారావు, జేఏసీ నాయకులు ఆర్‌ఎస్ హరనాథ్, మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బొల్లిన నాగకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

అడ్వకేట్స్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలు చేయాలి


తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న న్యాయవాదులు

జంగారెడ్డిగూడెం: న్యాయవాదులపై దాడులు పెరుగుతున్న తరుణంలో అడ్వకేట్స్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ న్యాయవాదులు తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. పట్టణ న్యాయస్థాన ప్రాంగణంలో న్యాయవాదులు కండువాలు ధరించి, నినాదాలు చేస్తూ ప్రభుత్వాన్ని ఉద్దేశించి తమ ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జీఎస్‌ఆర్ మూర్తి, ఉపాధ్యక్షుడు మోడేపల్లి నాగులు, కోశాధికారి మానికల సూరిబాబు న్యాయవాదులు పొన్నా లక్ష్మణరావు, ఎన్‌వీబీఎల్ ఆచారి, సీహెచ్‌డీవీ కోటేశ్వరరావు, గర్సికూటి చిరంజీవి రాంబాబు, మాదా రామమోహనరావు, బొడ్డు వాసు, ఓగిరాల సర్వేశ్వరరావు, వింజమూరు కిరణ్, జువ్వల బాబూజీరావు తదితరులు పాల్గొన్నారు.

వాణిజ్య పంటలతో రైతాంగం అభివృద్ధి


కార్యక్రమంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి

కొయ్యలగూడెం: వాణిజ్య పంటలతో రైతులు ఆర్థికంగా ఎదుగుతారని, తద్వారా గ్రామీణ ప్రాంత అభివృద్ధి సాధ్యపడుతుందని కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ పేర్కొన్నారు. గురువారం కొయ్యలగూడెం -తాడేపల్లిగూడెం రోడ్డులోని గ్రీన్ ఫీల్డ్ హైవేకి ఆనుకుని ఉన్న సర్వీస్ రోడ్డులో సీయా ఆయిల్ ఫిల్లింగ్ స్టేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏజెన్సీ మెట్ట ప్రాంత అభివృద్ధికి వాణిజ్య పంటలైన వర్జీనియా పొగాకు, పామాయిల్ దోహదపడ్డాయని అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా కేంద్రంగా ఏ పట్టణాన్ని ఎంపిక చేస్తారని అడిగిన విలేకరుల ప్రశ్నకు ఆయన దాటవేత వైఖరి అవలంబించారు. డీసీసీబీ మాజీ చైర్మన్ కరాటం రాంబాబు, ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు ఎస్‌ఆర్‌ఆర్ సుభద్రాదేవి, మాజీ సర్పంచ్ ఎస్ ఆర్ ఆర్ నరసింహారాజు, పాల్గొన్నారు.

అధికారుల గైర్హాజరుపై ఎంపీపీ ఆగ్రహం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రత్నకుమార్

చింతలపూడి: మండల పరిషత్ సమావేశాలకు అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఎంపీపీ బాణావతు రాంబాబు నాయక్ ఆదేశించారు. చింతలపూడి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం ఎంపీపీ బి.రాంబాబు నాయక్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో అధికారుల గైర్హాజరుపై ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన ఎంపీపీ ఇకపై సమావేశాలకు గైర్హాజరు అయిన అధికారులపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సమావేశంలో ఎంపీడీవో రత్నకుమార్ మాట్లాడారు. సమావేశంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

జ్వరాలను అరికట్టాలని ధర్నా

కుక్కునూరు: మండలంలోని పలు గ్రామాల్లో విజృంభిస్తున్న టైఫాయిడ్, మలేరియా, డెంగీ జ్వరాలను అరికట్టాలని కోరుతూ గురువారం సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ధర్నాలో జంగారెడ్డిగూడెం డివిజన్ మండల కార్యదర్శులు సోయం చందర్‌రావు, కంగాల కల్లయ్య, పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి షేక్ మున్ని, సున్నం రాణి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

టి.నరసాపురం: సమాజ అభివృద్ధి, ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందని టి.నరసాపురం లయన్స్‌క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు పెద్దిన ప్రసాద్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తమ ఉపాధ్యాయులను గురువారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

ఎఫ్‌ఎస్‌వో నాగవాసుకి సత్కారం

కొయ్యలగూడెం: కన్నాపురం కార్యాలయంలో సుంకర వాసు సన్మాన కార్యక్రమం అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. జంగారెడ్డిగూడెం అటవీ శాఖ కార్యాలయంలో ఎఫ్ఎస్‌ఓగా విధులు నిర్వహిస్తున్న వాసు ఇటీవల జర్మనీ దేశంలో జరిగిన వరల్డ్ ట్రాన్స్‌ప్లాంట్ గేమ్స్ 2025లో పాల్గొని రెండో స్థానంలో నిలిచి రజత పతకం సాధించినందుకు అభినందించారు. రేంజ్ అధికారి ఎస్‌కే వలి, హెడ్ క్వార్టర్ ఎఫ్ఎస్ఓ బి.దినేష్ , డిప్యూటీ రేంజర్ జె.ప్రభాకర్, ఎఫ్ఎస్ఓలు ఎండి కరీం, బి.పోసారావు, సిబ్బంది పాల్గొన్నారు.

అంతర పంటలతో అధిక లాభాలు

కామవరపుకోట: రైతులు కొబ్బరి, పామాయిల్ తోటల్లో అంతర పంటలు సాగు చేయడం వలన అధిక లాభాలను పొందవచ్చునని సిపిసిఆర్ఐ ఫార్మర్ డైరెక్టర్ పి.చౌడప్ప తెలిపారు. మండలంలో తడికలపూడి ,కళ్ళచెరువు గ్రామాలలో కొబ్బరి పామాయిల్ తోటలో గల అంతర పంటల సాగులను ఆయన పరిశీలించారు.